www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 02 | ఏప్రిల్ | 2026 పేజీలు : 8

# నేటి నుంచి గ్రామసభలు

-అన్ని గ్రామ పంచాయతీల్లోనూ పది గంటలకు ప్రారంభం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లోనూ గురువారం ఉదయం 10 గంటలకు గ్రామసభలను నిర్వహించనున్నారు. జయజయహే తెలంగాణ అనే రాష్ట్ర గీతాలాపనతో గ్రామసభలు ప్రారంభం కానున్నాయి. గ్రామసభలో గ్రామ సర్పంచ్, పాలక వర్గ సభ్యులతో పాటు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. మున్సిపాలిటీలలో మున్సిపల్ ఛైర్మన్, అధికారులు హాజరు కావాల్సి ఉంది. రాష్ట్ర గీతాలాపన తర్వాత సిఎం సందేశాన్ని వినిపిస్తారు. గడిచిన రెండున్నర ఏళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయాలు, ఆరు గ్యారెంటీలపై అవగాహన కల్పించడంతో పాటు వివిధ పథకాలకు సంబంధించి లబ్దిదారుల వివరాలను వెల్లడిస్తారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీలు, పరిపాలన కేంద్రాల వద్ద ఫిర్యాదుల బాక్స్‌లను ఏర్పాటు చేస్తారు. సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తారు. ఇదిలా ఉండగా ఒకేసారి గ్రామసభలు నిర్వహించడంతో సమాచారం తెలిపేందుకు అధికారుల హాజరు ఇబ్బందికరంగా ఉంటుందన్న భావన అధికార వర్గాల నుంచి వ్యక్తమవుతుంది. ఇప్పటికే మహాలక్ష్మి , ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, రైతు భరోసా, ఉచిత విద్యుత్, గ్యాస్ సిలెండర్లు మొదలైన పథకాల లబ్దిదారుల జాబితాను వెల్లడించడంతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్హుల జాబితాను వెల్లడించే అవకాశం ఉంది. గ్రామసభల నిర్వహణకు సంబంధించి నిధులు కూడా మంజూరయ్యాయి. ఎల్ఈడి స్క్రీన్లు, సౌండ్ సిస్టం, స్టేజ్ డేకరేషన్లు ఏర్పాటు చేసి గ్రామసభను నిర్వహించాల్సి ఉంటుంది.

# ఏసిబి తనిఖీల్లో.. విస్తుపోయే నిజాలు..!




-రూ. 14 కోట్ల, 23 లక్షలు వసూలు కాలేదా...?
-అడ్వర్టైజింగ్ అమౌంట్ రూ. 3 కోట్ల, 80 లక్షలు
-ఎందుకు వసూలు కాలేదు...?
-బిల్ కలెక్టర్, మేనేజర్, సిబ్బంది మధ్య అనుమానాస్పద లావాదేవీలేంటి..?
-మొబైల్ ఫోన్‌లల్లో ఏముంది...?

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మున్సిపాలిటీలో మంగళవారం ఉదయం నుండి బుధవారం తెల్లవారు జాము 4 గంటల వరకు సాగిన ఏసీబీ అధికారుల సోదాలలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. 2025, 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిపిన తనిఖీలో రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, పన్నులు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, కార్యాలయం యొక్క మొత్తం పని తీరును తనిఖీ చేయగా, ఈ క్రింది అవకతవకలు గమనించబడినట్లు ఏసిబి డి.ఎస్.పి రమేష్ తెలిపారు. 20252026 ఆర్థిక సంవత్సరానికి ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీంకు రూ.16,44,15,000 వసూలు కావాల్సి ఉండగా, రూ.3,36,00,000 మాత్రమే వసూలైనట్లు రికార్డులు చెపుతున్నాయి. ఇంకా రూ. 13,08,15,000 వసూలు కాకపోవటానికి కారణాలు తెలియాల్సి ఉంది. ఎల్ ఆర్.ఎస్ పథకంలో ధరఖాస్తు చేసుకున్న వారు తప్పకుండా పైసాతో సహా కట్టి పనులు చేసుకుంటారు కాని ఇక్కడ సుమారు రూ. 13 కోట్లు వసూలు కాకపోవటానికి అధికారులకే తెలియాలి. అదే విధంగా ఆస్తి పన్ను రూ. 5,12,68,000 రావాల్సి ఉండగా, రూ.4,09,85,000 వసూలు కాగా ఇంకా రూ.1,02,83.000 బ్యాలన్స్

మిగతా 2లో..

# ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండా



-ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని ప్రారంభించిన బాగం

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఐ పని చేస్తుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి పోరాట కార్యాచరణను రూపొందించుకునేందుకు ఏప్రిల్ ఒకటి నుంచి 10 రోజుల పాటు ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. బుధవారం ఖమ్మం టూటౌన్ పరిధిలో హేమంతరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ పాలక వర్గాలు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నాయని, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా మౌలిక వసతుల కల్పనలో విఫలమయ్యారన్నారు. ముఖ్యంగా పట్టణ పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కేవలం సంపన్న వర్గాల కోసమే పని చేస్తుందని యుద్ధం పేరుతో ఇష్టానుసారంగా

మిగతా 2లో..

# యువత భవిత కకావికలం..!

అటకెక్కిన ఉద్యోగాల భర్తీ... అమలు కాని నిరుద్యోగ భృతి




సెంటర్ స్ప్రెడ్

# నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి




-రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి
-అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బ్లాక్ డే

2లో..

# ప్రజాపోరాటాల స్ఫూర్తిని ఇంటింటికీ తీసుకెళతాం





- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** ప్రజాపోరాటాల స్ఫూర్తిని ఇంటింటికీ తీసుకెళతామని, ఆ దిశగా పార్టీ కార్యకర్తలు నడుం బిగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం జిల్లాలోని అన్ని మండల పట్టణ కేంద్రాల్లో ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి పాషా హాజరై ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతామని వివరించారు. వందేళ్ల పోరాట చరిత్ర కలిగిన పార్టీకి ప్రజలు అండగా నిలవాలని ప్రతీ గడపుకు చేరుకుని కమ్యూనిస్టు పోరాటాలు త్యాగాలు ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. నిత్యం ప్రజలకు అండగా నిలబడి వారి సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 1 నుండి 15వ తేది వరకు పక్షం రోజుల పాటు ఈ కార్యక్రమం ఉధృతంగా కొనసాగుతుందన్నారు. పేదల పక్షా నిలబడే పోరాటాల పార్టీకి ప్రజలు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ సామాన్యుల హక్కుల సాధనకై సిపిఐ ఎల్లవేళలా ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ పదిహేను రోజుల ప్రచారంలో భాగంగా ప్రతీ ప్రాంతంలో ప్రజా సమస్యలు గుర్తించి వాటి పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, దుర్గరాశి వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, వై ఉదయ్ భాస్కర్, కందుల భాస్కర్,

మిగతా 2లో..

# ఏసిబి తనిఖీల్లో..విస్తుపోయే నిజాలు..!

**మొదటిపేజీ తరువాయి)**
ఉంది. షాపింగ్ కాంప్లెక్స్ ఆస్తి పన్ను రూ.62,61,525 రావాల్సి ఉండగా కేవలం రూ.53,38,655/ వసూలైనట్లు అధికారులు రికార్డులలో చూపగా, రూ. 8,72,870 రావాల్సి ఉంది. ప్రకటన పన్ను రూ.3,80,679 రావాల్సి ఉండగా ఒక్క రూపాయి కూడా వసూలు కాకపోవటం పలు అనుమానాలకు తావిస్తుంది. మొత్తంగా రూ.22,23,25,204 రావాల్సి ఉండగా , కేవలం రూ.7,99,23,655 వసూలు కాగా, సుమారు రూ.14,23,51,549 వసూలు కావాల్సి ఉన్నట్లు తెలుస్తుంది. ఏసిబి అధికారుల సోదాల్లో సిబ్బంది మొబైల్ ఫోన్ లను తనిఖీ చేసే సమయంలో అనుమానాస్పద లావాదేవీలు గమనించబడ్డినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా సత్తుపల్లి మున్సిపాలిటీ బిల్ కలెక్టర్ నాగుబండి నరసింహారావు మొబైల్ ఫోన్‌లో, సత్తుపల్లి మున్సిపాలిటీ మేనేజర్ ఎం. శ్రీనివాస్, ఇతరులు పాల్గొన్న అనుమానాస్పద లావాదేవీలు వెల్లడయ్యాయన్నట్లు తెలుస్తుంది. ధృవీకరణ సమయంలో, రికార్డుల నిర్వహణ, ఆదాయాల వసూళ్లలో మరికొన్ని అవకతవకలు కూడా గమనించబడ్డినట్లు తెలుస్తుంది. లోపాల పరిధిని నిర్ధారించడానికి, సంబంధిత అధికారులపై బాధ్యతను నిర్ణయించడానికి రికార్డుల తదుపరి పరిశీలన కొనసాగుతోందన్నారు. బాధ్యులైన మున్సిపల్ అధికారులపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేస్తూ ప్రభుత్వానికి ఒక సవివరమైన నివేదిక సమర్పించబడుతుందన్నారు. ఏదైనా ప్రభుత్వ అధికారి లంచం డిమాండ్ చేసిన సందర్భంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడానికి ప్రజలు ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించవలసిందిగా కోరారు. ఏసీబీ తెలంగాణను సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లైన వాట్సాప్ (9440446106), ఫేస్ బుక్ (తెలంగాణ ఏసీబీ), ట్విట్టర్ తెలంగాణ ఏసీబీ ద్వారా కూడా సంప్రదించవచ్చునన్నారు. తెలంగాణ ఏసీబీని సంప్రదించడానికి, ఏసీబీ క్యూఆర్ కోడ్ అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో, ప్రముఖ బహిరంగ ప్రదేశాలలో ప్రదర్శించబడుతుందని, బాధితుడు/ఫిర్యాదుదారుడి పేరు, వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఏసిబి డిఎస్ పి రమేష్ తెలిపారు.

# ప్రజాపోరాటాల స్ఫూర్తిని ఇంటింటికీ తీసుకెళతాం

**మొదటిపేజీ తరువాయి)**
జి వీరస్వామి, భూక్యా ధస్రు, ఎస్‌కే ఫహీమ్, కొమారిహన్మంతరావు, దీటి లక్ష్మీపతి పాల్గొన్నారు.



**కొత్తగూడెం కార్పొరేషన్ 18వ డివిజన్‌లో...**
కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌లో ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని కార్పొరేటర్ కంచర్ల హిమశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సిపిఐ మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. పార్టీ పిలుపులో భాగంగా ప్రజా సమస్యలు, మౌలిక వసతుల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వానికి నివేదించేందుకు ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పార్టీ నూరేళ్ల చరిత్ర ప్రజల్లో మరింత విస్తృతంగా తీసుకెళ్లి ప్రజలతో మమేకం అవుతూ వారికి అండగా ఉంటామని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యల పరిష్కారాని రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. కార్మికులు, బడుగు బలహీన వర్గాల పేదలకు సిపిఐ అనునిత్యం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, బుడితి మంగాదేవి, కాటి శ్రీకాంత్, బుడితి పృథ్వీ, బడుగు సుధారాణి, కాటి మాధవి, మారపాక సారిక, మారపాక ఆస్మ పాల్గొన్నారు.

**చర్లలో...**
ఇంటిటికీ సిపిఐ కార్యక్రమాని బుధవారం చర్ల ప్రధాన రోడ్‌లో సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సిపిఐ ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చిందన్నారు. అనేక కార్యక్రమాల సిపిఐ చర్ల కేంద్రంగా శ్రీకారం చుట్టుందని గుర్తు చేశారు. పదిహేను రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజా సమస్యలు, మౌళిక వసతులు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ప్రజుల ఎప్పటి మాదిరిగానే పార్టీ కార్యక్రమాలను ఆదరించి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి నూపా పోతయ్య, సహాయ కార్యదర్శులు కోటి ముత్యాల రావు,చల్లా లక్ష్మీనారాయణ, కోడిరెక్కల రాజారావు, నర్సింహారావు, రమణ, తేజ, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, దుర్గాప్రసాద్, మోతీర్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్త బ్లాక్ డేలో భాగంగా బుధవారం ఖమ్మం నగరంలో అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను పూర్తిగా రద్దు చేసి వాటి స్థానంలో కార్మికులకు వ్యతిరేకంగా యాజమాన్యాలకు అనుకూలంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. కార్మిక చట్టాలలో అతి ముఖ్యమైన ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ యాక్ట్ 1926, పారిశ్రామిక ఉపాధి (స్టాండ్ ఆర్డర్స్) చట్టం1946 , పారిశ్రామిక వివాదాల చట్టం 1947 తదితర చట్టాలను పూర్తిగా రద్దు చేసిందన్నారు. వాటి స్థానంలో తీసుకువచ్చిన పారిశ్రామిక సంబంధాల కోడ్ 2022లో అన్ని అంశాలు ఉన్నట్లుగానే కనిపిస్తాయని కానీ అవి ఆచరణకు సాధ్యం కావని వారు తెలిపారు. మోడీ ప్రభుత్వం భవిష్యత్తులో పర్మినెంట్ ఉద్యోగాలు లేకుండా కాలపరిమితితో కూడిన ఉద్యోగాలను సృష్టిస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నివీర్, అగ్నిపద్ లాంటి పథకాలతో ఈ విధానాలకు శ్రీకారం చుట్టిందన్నారు. పారిశ్రామికవేత్తల ఆదేశాల మేరకు 12 గంటల పనివిధానాన్ని ప్రవేశపెట్టి బిజెపి పాలిత రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్నాటకలో ఆమోదింపజేశారని వారు విమర్శించారు. దీని ఫలితంగానే కర్నాటక ప్రజలు ఆగ్రహానికి గురై అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చిందన్నారు. వెంటనే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీనారాయణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి. విష్ణువర్ధన్, ఐఎన్‌టియుసి టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుక్కల రామకృష్ణ, ఉపాధ్యక్షులు సిద్దెల నగేష్, టియుసిఐ రాష్ట్ర నాయకులు జి. రామయ్య, సివై పుల్లయ్య, కె. శ్రీనివాస్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు సుబాని, జిల్లా నాయకులు శంకర్ పాల్గొన్నారు.

# ఖైదీలు మానసికంగా, ఆరోగ్యంగా ఉండాలి

**-జిల్లా జైలులో వైద్య శిబిరం**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖైదీలు మానసికంగా, ఆరోగ్యంగా ఉండాలని జిల్లా కారాగార పర్యవేక్షణ అధికారి ఎ. శ్రీధర్, డిఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ రామారావు తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కారాగారం నందు ఖైదీల ఆరోగ్య పరిరక్షణ కోసం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వివిధ విభాగాల వైద్యులు పాల్గొని ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పలువురికి వివిధ వ్యాధులను గుర్తించి చికిత్సలు అందించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఖైదీలకు ఆరోగ్య పరిరక్షణపై వైద్యులు పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ వైద్య శిబిరం ఖైదీల ఆరోగ్య పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని కారాగార పర్యవేక్షణ అధికారి శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, ఆర్ఎంవో డాక్టర్ రాంబాబు, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్



నాగేశ్వరరావు, డాక్టర్ సునీల్, లిఖిత, ఎస్‌కె ఆస్మా, నరేష్, శ్రీకాంత్, డా॥ సిద్దార్థ, జైలర్లు ఎ. సక్రు, జి. లక్ష్మీనారాయణ, డిప్యూటీ జైలర్లు ఎ. సుభాష్, ఎం. వెంకటేశ్వర్లు, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండా



**మొదటిపేజీ తరువాయి)**
ధరలు పెంచేస్తున్నా మౌనంగా చూస్తుంది తప్ప నివారణ చర్యలు చేపట్టలేదని హేమంతరావు తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉద్యోగ, ఉపాధి రంగాలు వట్టిపోతున్నాయని ఆయన తెలిపారు. కనీస వసతుల కల్పనకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పోరాట కార్యాచరణను రూపొందించుకుని పరిష్కారానికి కృషి చేసేందుకు ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి సమస్యలను గుర్తించి వివరాలను పొందుపరిచారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, పోటు కళావతి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు గాదె లక్ష్మీనారాయణ, ఎస్‌కె సైదా, వరదా నర్సింహారావు, జ్వాలా నర్సింహారావు, మందా వెంకటేశ్వర్లు, మాడుగుల నాగేశ్వరరావు, చానా తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని వి. వెంకటాయపాలెంలోని జగ్యాతండా అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు వితరణ చేశారు. బుధవారం గ్రామానికి చెందిన మూడ్ కృష్ణ ప్రియాంక దంపతులు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే బాలింతలు, గర్భిణీల సౌకర్యార్థం ఐదు కుర్చీలను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కె. కవిత, ఎంవిఏ షాలిని, హెల్త్ సిబ్బంది, గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.



# ఇరిగేషన్ సిఈకి శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా జల వనరుల శాఖ చీఫ్ ఇంజనీర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన మంగళంపూడి వెంకటేశ్వరరావు తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం సిఈ వెంకటేశ్వరరావును టిజీవో జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి, కార్యవర్గ సభ్యులు కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిజీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి శేషప్రసాద్, హౌజ్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డా॥ పి. విజయ్‌కుమార్, టిజివో కార్యవర్గ సభ్యులు మేకల గోపాలకృష్ణ, మోదుగు వెంకటేశ్వర్లు, బి. హరీష్, సతీష్, భాస్కర్, డా॥ బి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం చేయవద్దు

## మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ

**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ బుదవారం మున్సిల్ బిల్ కలెక్టర్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ పన్నులు వసూలు విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. మున్సిపల్ అభివృద్ధి ధ్యేయంగా పనిచేయాలని ఎక్కడ ఎలాంటి అవినీతి లేకుండా మంచి పేరు తెచ్చేందుకు మనందరం కృషి చేయాలని ఆమె వారికి సూచించారు. మున్సిపల్ ఆదాయం పెంచేందుకు ప్రతిఒక్కరూ ముందుకు పోవాలని పన్నులు వసూల్లో నిర్లక్ష్యం ఆలస్యం చేయవద్దని చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ సూచించారు.



# ఆటో పల్టీ.. వ్యక్తి మృతి

**గాయాలైన వారిని ఖమ్మం తరలించిన ఎస్ఐ**

**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఆటో పల్టీ కొట్టి ఒకరు మృతిచెందిన పలువురికి గాయాలైన సంఘటన మండల పరిదలోని తనికెళ్ల సమీపంలో బుదవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై జి సూరజ్ తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిదిలోని పెద్ద గోపతినుంచి కుటుంబసభ్యులతో కలిసి నంబి ఫణిదర్ (31) ఆటోలో ఖమ్మం వెళుతున్నారు. తనికెళ్ల సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న వాహనాలు తప్పించబోయి ఎడమవైపుకు ఆటోను తిప్పగా ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నంబి ఫణిదర్ కు తీవ్రగాయాలయ్యాయి. క్షత గాత్రులను ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతు ఫణిదర్ మృతిచెందాడు. పూదూరి జయరాం ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# పార్టీ బలోపేతం, విస్తరణే లక్ష్యంగా కార్యాచరణ

**-ఉపాధి హామీ పథకాన్ని పట్టణ పేదలకు వర్తింపజేయాలి**
**-పేదలకు ఇండ్ల స్థలాలను పంపిణీ చేయాలి**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ విస్తరణ, బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. అనేక దశాబ్దాలుగా పాలకులు పట్టణ పేదలను విస్మరిస్తున్నారని ఆయన తెలిపారు. సిపిఐ ఖమ్మం నగర సమావేశం బుధవారం ఎస్‌కె జానిమియా అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ పార్టీ నిర్మాణ కర్తవ్యాల్లో భాగంగా అన్ని డివిజన్లలోనూ సమావేశాలను ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. మూడు దశాబ్దాలుగా దేశ వ్యాప్తంగా పట్టణీకరణ పెరిగిపోయిందని వ్యవసాయ రంగ సంక్షోభం ఇతరత్రా కారణాలతో పెద్ద సంఖ్యలో ప్రజలు పట్టణాలకు వలస వచ్చారని హేమంతరావు తెలిపారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనలో పాలకులు విఫలమయ్యారన్నారు. ముఖ్యంగా నివాస స్థలాల సమస్య ప్రధానంగా మారిందని పాలకులు నివాస స్థలాల గురించి మాట్లాడడం లేదన్నారు. రియల్ ఎస్టేట్ పుణ్యమా అని ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో స్థలం కొనుగోలు చేసుకోలేక అద్దెలు చెల్లించలేక పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో ప్రభుత్వాలు వ్యవహరించినట్లుగానే పట్టణ పేదలను గుర్తించి నివాస స్థలాలు పంపిణీ చేయాలన్నారు. విబి జీ రాం జీ పథకాన్ని సవరించి పట్టణ పేదలకు కూడా పథకం వర్తించేవిధంగా చర్య లు తీసుకోవాలని ఆయన తెలిపారు. నిర్మాణ రంగం కుదేలు కావడం ఇతరత్రా సమస్యలతో ఉపాధి కరువవుతుందని ఆయన తెలిపారు. 2026 పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరణ కార్యక్రమం వేగంగా చేపట్టాలని ఏప్రిల్ 15 నాటికి సభ్యత్వం పూర్తి చేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, జిల్లా కౌన్సిల్ సభ్యులు వరదా నర్సింహారావు, వివిధ ఏరియా పార్టీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్‌లను విరమించుకోవాలి : ఎఐటియుసి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు ఏఐటియూసి నాయకులు. కోడ్ ల రద్దు కోరుతూ జరుగుతున్న దేశవ్యాప్త నిరసనలో భాగంగా బుధవారం సత్తుపల్లి మండలం గంగారం తాపీ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికులను కట్టు బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడలను వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే అనేక రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేత చట్టాన్ని అమలు చేయాలని, భవననిర్మాణ కార్మికులకు, 60 సంవత్సరాలు దాటిన ప్రతి కార్మికుడికి సంక్షేమం బోర్డు ద్వారా ప్రతి నెలా రూ. 5,000 పెన్షన్ ఇవ్వాలన్నారు. అదే విధంగా కార్మికులకు రక్త పరీక్ష ల పేరుతో కార్మికుల సంక్షేమ బోర్డు నుంచి లక్షలాది రూపాయల కొల్లగొడుతున్నారని తక్షణమే భావన నిర్మాణ కార్మికులకు రక్త పరీక్షల వల్ల ఎటువంటి ఉపయోగం లేదు కాబట్టి తక్షణమే రక్త పరీక్షల కాంట్రాక్ట్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాపీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ రహమతుల్లా, కనపర్తి మాలాద్రి, అసావత్ కృష్ణ, చిరంజీవి, తాటి శీను, కసుమూరు వలి,గురవయ్య, వెంకటేశ్వ రావు, శీను, భవాని, పుల్లారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి




**ప్రజాపక్షం/చింతకాని :** రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి మహేష్, డిమాండ్ చేవారు. మంగళవారం రాత్రి చింతకాని మండలం రాఘవాపురంలో ఏర్పాటు చేసిన శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా నిరుద్యోగులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో ఏటా 2లక్షల ఉద్యోగాల భర్తీ చేసామని, నెలకు రూ.4వేల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి నేటికి అమలు చేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో ఎద్ద ఎత్తున యువత ఉద్యమిస్తుందన్నారు. అనంతరం రాఘవాపురం శాఖ నూతన కమిటీ ని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా షేక్ రహీం పాషా, కొత్తకొండ మురళీ, ఉపాధ్యక్షులుగా కంపల్లి రమేష్, సింగారపు గోపి, సహాయ కార్యదర్శులుగా గుండగాని మధు, మేకల గోపి చంద్, కోశాధికరిగా సామల అఖిల్ తో పాటు 10మంది కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కొల్లి రవి, ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్, జిల్లా సహాయ కార్యదర్శి చింతల రమేష్, వడ్డె వీరకృష్ణ, రాజేష్, కనపర్తి సత్యనారాయణ, కంపా అమరయ్య, అనిల్, నవీన్, కిషోర్, కార్తీక్, సురేందర్, దొబ్బల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# నల్లబంగారం ఉత్పత్తిలో సత్తుపల్లి అగ్రగామి




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** నల్లబంగారం ఉత్పత్తిలో సత్తుపల్లి అగ్రగామిగా నిలిచిన సందర్భంగా ఐ.ఎన్.టి.యూ.సి జాయింట్ జనరల్ సెక్రెటరీ తీగల క్రాంతికుమార్ బుధవారం జిఎం చింతల శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కులుసుని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రాంతికుమార్ మాట్లాడుతూ సత్తుపల్లి ఏరియాకు నిర్దేశించిన సుమారు 15 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి రవాణాను ఆర్థిక సంవత్సరంలో సాధించినందుకు గాను సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ ను శాలువాతో సత్కరించినట్లు తెలిపారు. జి.ఎం దిశా నిర్దేశంతో ఉత్పత్తి సాధనలో కృషిచేసిన ఏరియా ఉద్యోగులు, అధికారులు, డి.ఎల్.ఆర్ ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జి.ఎం మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో ఏరియా కు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడంలో ఉద్యోగస్తులు అధికారులు, యూనియన్ ప్రతినిధులు ఎవరికి వారు వారికి కేటాయించిన పనులను రక్షణతో నిర్వర్తించి ఏరియాను నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోగలిగమన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న ఆర్థిక సంవత్సరాలలో నిర్దేశించిన లక్ష్యాన్ని రక్షణతో పూర్తి చేయాలని సంస్థ అభివృద్ధి కొరకు అహర్నిశలు శ్రమించి కృషిచేయాలని, సింగరేణి సంస్థను కాపాడే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓ టు జి.ఎం బొల్లం శ్రీనివాస్, ప్రహల్లాద్ (ప్రాజెక్ట్ ఆఫీసర్, జే.వి.ఆర్ ఓసి), సునీల్ వర్మ (ప్రాజెక్ట్ ఆఫీసర్, కిష్టారం ఓసి), సోమశేఖర్ (డీ.జి.ఎం, జే.వి.ఆర్ సి.హెచ్ పి), రాజేశ్వరరావు (మేనేజర్, జే.వి.ఆర్ ఓసి), రామకృష్ణ (మేనేజర్, కిష్టారం ఓసి) ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ చీరలు పంపిణీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. బుధవారం ఖమ్మం నగరంలోని 26వ డివిజన్ సుగ్గలవారితోటలో నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య పాల్గొని ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. డ్వాక్రా సభ్యులకే కాకుండా అర్హత కలిగిన ప్రతి మహిళకు ఉచితంగా చీరల పంపిణీ చేపడుతుందన్నారు. ఖమ్మం నగరంలో అన్ని డివిజన్లలో ఈ చీరల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్, మెప్మా టిఎంసి సుజాత, నాయకులు బొడ్డుబోయిన శ్రీను, కనకరాజు, ప్రసాద్, యాకూబ్, బుజ్జి, మాధవి, సైదా, సలీం, మదార్, ఆర్‌పిలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌బిఐటి ఆధ్వర్యంలో ఆశ్రమాల్లో అన్నదానం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్వర్ణభారతి ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో వృద్ధ, అనాథ, మానసిక వికలాంగ ఆశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌బిఐటి వార్షికోత్సవం, ఆరోహన్ 2026లో భాగంగా బుధవారం ఖమ్మం నగరంలోని పలు వృద్ధ, అనాథ, మానసిక వికలాంగ గృహాలలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు విద్య, సాంకేతికత, కళాత్మక వేడుకలతో పాటు సేవాగుణం అలవర్చుకోవాలని అందులో భాగంగానే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. విద్యాదానం ద్వారా మానసికంగా సంతృప్తి చెందుతున్నా అన్నదానం ద్వారా ఆత్మసంతృప్తి చెందుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, కో ఆర్డినేటర్ ఖాసీంపాషా, హెచ్‌వోడిలు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చింతకానిలో మెగా హెల్త్ క్యాంప్




**ప్రజాపక్షం/చింతకాని :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా హెల్త్ క్యాంపును చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మనోహర్ బాబు మాట్లాడుతూ ఆరోగ్య తెలంగాణ నే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. తహసీల్దార్ బాబ్జీప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ ను బాలికలకు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం రోగులను పరిక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ ఆల్తాఫ్, పల్లె దవాఖానా వైద్యులు వేణుమాధవ్, సుప్రియ, సోయల్, అనిల్ , సూపర్వైజర్లు వీరేందర్, కృష్ణారావు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాలను రద్దు చేస్తే సహించేది లేదు




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తే సహించేది లేదని సిఐటియు జిల్లా నాయకులు సిఐటియు నాయకులు మోరంపూడి పాండురంగారావు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొలికపోగు సర్వేశ్వరరావులు మాట్లాడుతూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం అంబేద్కర్ విగ్రహం వద్ద కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియూ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడులను ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి దేశవ్యాప్తంగా అమలు పరచాలని సిద్ధం చేసిందని దానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. నాలుగు లేబర్ కోడ్ లను అమలు జరపకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని లేని పక్షంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ రానున్న కాలంలో కార్మిక వర్గాన్ని సమీకరించి పెద్ద ఎత్తున పోరాటంలోకి దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ రావు రాధాకృష్ణ, నాగేశ్వరావు, ఖాన్, మధు, జగన్, నాగరాజు, మస్తాన్, వెంకటేష్, శేషు, ఏసు బాబు తదితరులు పాల్గొన్నారు.

## 108 సిబ్బందికి అభినందనలు

**-అత్యవసర సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్న సిబ్బంది**



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** ఏప్రిల్ 2న జరుపుకునే జాతీయ ఈఎంసీటీడే(ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ డే)సందర్భంగా 108 అత్యవసర సేవల్లో పని చేస్తున్న సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ నజిరుద్దీన్ ఆదేశాల మేరకు అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సేవలందిస్తున్న 108 ఈఎంసీటీ సిబ్బందిని అభినందించారు. రోడ్డు ప్రమాదాలు, గర్భిణీ స్త్రీల అత్యవసర పరిస్థితులు, వివిధ అనారోగ్య సమస్యల సమయంలో సమాచారం అందిన వెంటనే ఘటన స్థలానికి చేరు కుని ప్రాథమిక చికిత్స అందిస్తూ గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలించడం ద్వారా ప్రాణాలు కాపాడటంలో 108 సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. అన్నపురెడ్డి పల్లి నూతన మండలంలో 2019 నుండి 108 అంబులెన్స్ సేవలు మండల ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు కూడా అందిస్తూ ఆపద్బాంధవుల్లా సేవలందిస్తున్నాయి. ఈ సందర్భంగా ఈఎంసీటీలు కనపర్తి కళాధర్, పద్మ, ఫైలట్లు సురేష్, రాజాలను మండల ప్రజల తరపున అభినందించారు.

## లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ సీఐటీయూ నిరసన

**-కోడ్‌ల ప్రతులు దగ్ధం**



**ప్రజాపక్షం/ములకలపల్లి:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్ష ణమే రద్దు చేసి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు డిమాండ్ చేశారు. బుధవారం ములకలపల్లి మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు రహదారిపై ప్లకార్డులతో నిరసన చేపట్టి లేబర్ కోడ్‌ల ప్రతులను దగ్ధం చేశారు. ఈసందర్భంగా నిమ్మల మధు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు అమలు అయితే కార్మిక హక్కులు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ 26వేలు ఇవ్వాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వర్క రుక్మధ రావు, సూరం పుల్లారావు, హలావత్ శివ, అన్నవరపు ఇందిరా, బీబీనేని హరీష్, వీరభద్రం, భూక్య రవి, వంగల రామకృష్ణ, కొంగల శ్రీను, సున్నం ఆంజనేయులు, గుర్రం రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## కష్టజీవులకు వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం

**-సీఐటీయూ ఆధ్వర్యంలో బ్లాక్ డే నిరసన**



**ప్రజాపక్షం/కారేపల్లి:** కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి నిరసనగా సీఐటీయూ సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కారేపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు బ్లాక్ డే గా నిరసన చేపట్టి తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ కే నరేంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మిక హక్కులను దెబ్బ తీస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత చట్టాలను పునరుద్ధరించాలని, రైతులకు కనీస మద్దతు ధర చట్టం తీసుకురావాలని, విద్యుత్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో హమాలి యూనియన్ నాయకులు ఆరెల్లి శ్రీరాములు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శనగ రాంబాబు, గజ్జల శ్రీను, ఉపేందర్, గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ నాయకులు గుగులోత్ శ్రీను, కోటయ్య, బాబు, రైతులు కల్తి భద్రయ్య, వాంకుడోత్ బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

## పల్లె ప్రకృతి వనంలో బోరు మోటార్ దొంగతనం

**-పోలీసులకు ఫిర్యాదు**




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలం ఇరవెండి గ్రామ పంచాయితీ పరిధిలోని పల్లె ప్రకృతి వనంలో బోరు మోటార్ దొంగతనానికి గురైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామ అభివృద్ధతి, పర్యావరణ పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో ఈ ఘటన చోటు చేసుకోవడం పట్ల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఉదయం పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించడానికి వెళ్లిన గ్రామ సర్పంచ్ బాబురావు, ఉప సర్పంచ్ మహంకాళి రామారావు మోటార్ కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఈ ఘటనపై వెంటనే బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. గ్రామానికి ఎంతో ఉపయోగపడే పల్లె ప్రకృతి వనంలో మోటార్ దొంగతనం జరగడం బాధాకరమని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు తక్షణమే నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## యువత భవిత

# కకావికలం




- కోట్లాడి తెచ్చుకున్నా నామమాత్రపు నియామకాలు
- డిగ్రీలు పీజీలు చదివిన ఉద్యోగాలు కరువు
- స్వయం ఉపాధి కోసం యువత దారులు
- అటకెక్కిన ఉద్యోగాల భర్తీ.. నిరుద్యోగ భృతి

**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్:** నీళ్ళు నిధులు,నియామకాలు సాధనే లక్ష్యంగా పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో యువత భవిత పుష్కర కాలమైన ప్రశ్నర్ధాకంగా మారింది పట్టణ ప్రంతాలలో గ్రాడ్యూయేట్ యువత ఉద్యోగాలు దొరకకా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు ప్రభుత్వ రంగంల్లో ఏన్నో ఉద్యోగాలు ఖాళిగా ఉండడం,నియామకాలు మరింత అలస్యం అవ్వడం నిరుద్యోగం మరింత పెరగడానికి ఆస్కారం ఏర్పడుతున్నాట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.అదే సమయంలో ప్రైవేటు రంగంలో శిక్షణ లభించని యువతకు అవకాశాలు తక్కువగా ఉంటున్నాయి. గ్రామీణ యువత కూలీ పనులపై ఆధారపడుతున్నారు చాలామంది యువకులు వలసవెళ్ళే పరిస్థితి నెలకోంది.కోందరికి ఉపాది దోరకకా ఆర్ధిక ఇబ్బందులు పడుతున్నారు ప్రభుత్వం వివిద స్కిల్ డెవలప్‌మెంట్ కోర్స్‌లు జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నప్పటికి ఏటా లక్షలాది మంది విధ్యార్ధులు పట్టాభద్రులు కావడంతో నిరుద్యోగాన్ని పూర్తిగా అదికమించడం సాధ్యం కాకపోవడం ప్రధాన సమస్యగా మారింది ఉద్యోగాలు లేకపోవడంతో నిరుద్యోగులను ఉత్పత్తి చేస్తున్న కార్మాగారాలుగా ఉన్నత విధ్యాలయాలు మారిపోతున్నాయి

**ఉపాదికోసం నిరుద్యోగ యువత జీవనపోరాటం...**

ఉపాదికోసం నిరుద్యోగ యువత జీవనపోరాటం సాగించల్సివస్తుంది.పూటగడిస్తే.రోజు వెళ్ళదిస్తే అదే పదివేలుగా భావిస్తూ,ఉపాది దోరకకా యువత ఆశలు చిద్రమవుతున్నాయి ఉద్యోగాల ఖాలీల ప్రకటనల కోసం కళ్ళల్లో ఓత్తులు వేసుకోని చూస్తున్న వారు కోకోల్లలు,ఉన్నత చదువులు చదివినవారు ఉపాది ఆవకాశాల కోసం దారులు వెతుకుట్టున్నారు జిల్లాలో నిరుద్యోగ సమస్యతో బాదపడుతున్నా ఉన్నత విద్యావంతులు స్వయం ఉపాది మార్గాలను ఎంచుకుంటూ తమ కుటుంబాలకు జీవనాధారం అవుతున్నారు డీగ్రీ,పీజిలు చదువుకున్న విద్యార్ధులుకు సంపదించే అవకాశాలు కల్పించేలా కొత్త నైపుణ్య కొర్సులను రూపోందిస్తున్న ఆశించిన ఫలివం అంతంత మాత్రమే

**నిరుద్యోగ అమలుకు నొచుకొని భుతి వాగ్దానం:**

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ నేతలు యుతవ కోసం అనేక వాగ్దానాలు చేశారు తమ ప్రభుత్వం అదికారంలోకి వచ్చాక మెదటి సంవత్సరంలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ .యస్సీ,యస్టీ, బీసి, మైనారిటి భ్యాక్‌లాక్ పోస్టులను తక్షనమే భర్తీ చేసి టి.యస్.పి.యస్సి. సంస్కరణలను జూన్ రెండు నాటికి ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేసి సెప్టెంబర్ 17 లోపు నియామాకాలు చేస్తమని ప్రకటించారు.విధ్యార్ధులకు పీజు రియంబర్స్‌మెంట్ డియస్సి.ఊర్ధు మీడియం పోస్టులను ఆంశాలను నిరుద్యోగ యువత కోసం మేనిపెస్టోలో చేర్చనట్లు చేబుతున్నారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇచ్చిన వాగ్దానాలను ఎన్నికల మేనిపెస్టోలా చేర్చిన ఆంశాలను అమలుచేయాలనీ కోరుతున్నారు.

## బిఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటా అధైర్య పడకండి

**పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి**



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** ప్రభుత్వం లేనంత మాత్రాన కార్యకర్తలు అధైర్య పడద్దని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పిండిప్రోలు, గోల్ తండా, రాజారం, గ్రామాలలో పలువురిని పరామర్శించారు. పిండిప్రోలు గ్రామంలోని ఉప సర్పంచ్ చామకూరి రాజు కూతురు చామకూరి విజయ ఫ్రూటీ కి ఇటీవల శాస్త్ర చికిత్స చేసుకోగా కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం గోల్ తండా లో మాజీ సర్పంచ్ బానోత్ పంతులు నాయక్ గుండెపోటుతో మృతి చెందగా అతని కుటుంబాన్ని ప్రారంభించారు. అనంతరం రాజారం గ్రామంలో మెట్టు వెంకన్న భార్య రాధా ఒకే వారం వ్యవధిలో ఇద్దరు గుండెపోటుతో మృతి చెందగా వారి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం హస్నాబాద్ గ్రామపంచాయతీలో బిఆర్ఎస్ తరపున గెలుపొందిన సర్పంచ్లను ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. సందర్భంగా హస్నాబాద్ గ్రామపంచాయతీలో కాంగ్రెస్ నాయకులు చేస్తున్న అరాచకాలను ఘర్షణలను ఆయనకు వివరించారు. బిఆర్ఎస్ కార్యకర్తలు ఎవరు తొందర పడద్దని అధికారం ఎవరికి చేస్తాం కాదని త్వరలో మనమే అధికారంలోకి వస్తామని ఆయన వివరించారు ప్రతి కార్యకర్తకు నేను అండగా ఉంటానని ఎవరు తొందరపడి ఘర్షణలకు పాల్పడుద్దని బిఆర్ఎస్ కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు భాష బోయిన వీరన్న, మండల పార్టీ కార్యదర్శి దేవరం దేవేందర్ రెడ్డి, నూతన సర్పంచులు కొవ్వూరి పద్మ సత్తి రెడ్డి, బోడ మంజూ రవి, ఉపసర్పంచ్ లు చామకూరి రాజు, షేక్ చందు, పరికపల్లి చంద్రశేఖర్ అసలాది ముత్తయ్య చామకూరి శరత్ చామకూరి సునీల్ చిట్టి మాజీ సర్పంచ్ లు బోడ మంచ నాయక్, బండ్ల సురేష్ ఆలస్యం నాగేశ్వరావు, తమ్మెర రామ్మోహన్ రెడ్డి, బానోతు రంగా, మాజీ ఎంపిటిసి శంకర్, తీగల మేఘ నాధరావు కొవ్వూరి సందీప్ రెడ్డి మోటపోతుల పెద్ద శ్రీను మోట పోతుల చిన్న శ్రీను మాగి వెంకన్న తండా అంజయ్య పల్లి, వినోద్ పల్లి, అశోక్ పల్లి నవీన్ వేల్పుల సైదులు ఉన్నం వెంకటేశ్వర్లు, జక్కుల యాదగిరి, పాసినేని శ్రీను, కొత్తపల్లి మహేష్, జెప్పుల సీతారాములు, బానోత్ వెంకన్న, సైదా సయ్యద్ హుస్సేన్, సయ్యద్ రంగాపురం బాలకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవకు అంకితమైన ప్రజా నాయకుడు పొంగులేటి

**ప్రజాపక్షం/కరకగూడెం:** ప్రజాసేవకు అంకితమైన ప్రజా నాయకుడు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. బుధవారం కరకగూడెం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు అసెంబ్లీలో కేటీఆర్,హరీష్ రావు లు ప్రజానాయకుడు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రజాసేవకు అంకితమైన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై వ్యక్తిగత విమర్శలు చేయడం రాజకీయ దౌర్భాగ్యం అన్నారు. ప్రజాప్రతినిధులను రాజకీయంగా ఎదుర్కోవాలి గాని కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకోవడం నీచ రాజకీయాలకు నిదర్శనం అని మండిపడ్డారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజా సమస్యల పరిష్కారానికి వినియోగించాల్సిన ప్రతిపక్షం, చట్టసభల్లో అప్రసక్తమైన విమర్శలకు దిగడం సిగ్గుచేటు చర్య అని విమర్శించారు.



చిత్తశుద్ధి ఉంటే ప్రజల సమస్యలపై చర్చించాలే గానీ వ్యక్తిగత విమర్శలతో ప్రజలను మభ్యపెట్టడం కుదరదని స్పష్టం చేశారు. పెద్దలను గౌరవించకుండా మాట్లాడడం రాజకీయ సంస్కృతికి విరుద్ధమని, ఇటువంటి చర్యలు కొనసాగితే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోసర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు, వెంకటాపురం సర్పంచ్ చౌలం కేశవరావు, మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగుబండి వెంకటేశ్వర్లు, మండల నాయకులు ఎర్ర సురేష్, జలగం కృష్ణ, గొగ్గలి రవి, భూక్య రాందాస్, షేక్ రఫీ, కొమరం వెంకటేశ్వర్లు, వార్డ్ మెంబర్ తోలెం సత్యనారాయణ పాల్గొన్నారు.

# పక్కదారి పడుతున్న పీఎం శ్రీ నిధులు..!

**-ఏడాది ముగుస్తున్నా కొనుగోలు కాని పరికరాలు**
**-విచారణ కోరుతున్న తల్లిదండ్రులు**






**ప్రజాపక్షం/చంద్రుగొండ:** విద్యార్థులకు ఆధునిక పరికరాల ద్వారా సులభంగా విద్యా బోధన అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం శ్రీ పథకం నిధులు పక్కదారి పడుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలోని అయ్యన్నపాలెం, అశ్వారావుపేట మండలంలోని నారావారిగూడెం, చర్ల మండలంలోని కొరుమూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు పీఎం శ్రీ పథకం కింద ఎంపికయ్యాయి. ఈ పథకం కింద ప్రతి పాఠశాలకు సంవత్సరానికి రూ 4లక్షల వరకు నిధులు మంజూరవుతాయి. పాఠశాల అభివృద్ధి పనులు, విద్యాబోధనకు అవసరమైన పరికరాల కొనుగోలు కోసం ఈ నిధులను వినియోగించాలి. అయితే అయ్యన్నపాలెం పీఎస్ పాఠశాలలో 1 నుండి 5వ తరగతి వరకు సుమారు 115 మంది విద్యార్థులు చదువుతున్నప్పటికీ, 2025,26 విద్యా సంవత్సరానికి వచ్చిన రెండు విడతల నిధులతో ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అదే విధంగా అవసరమైన పరికరాలను కొనుగోలు చేయకుండా తీర్మానాలపై ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రూ 1.40లక్షల విలువైన పరికరాల కొనుగోలు కోసం కొత్తగూడెంలోని సిటీ సెలక్షన్ సెంటర్‌కు ఇండెంట్ ఇచ్చినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. ఈ విషయంపై మండల విద్యాధికారి(ఎంఈఓ)సూరయ్యను వివరణ కోరగా, విషయంపై విచారణ జరిపిస్తామని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు సమగ్రంగా విచారణ చేసి నిధుల వినియోగంపై స్పష్టత ఇవ్వాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

## ఘనంగా అయ్యప్ప దేవాలయంలో విశేష పూజలు

**హాజరైన సిపిఐ జిల్లా కార్యదర్శి, కార్పోరేషన్ మేయర్**



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ బిసిఎం రహదారిలో గల స్వామి అయ్యప్ప దేవాలయంలో బుధవారం వాజీవాహన ధ్వజస్థంభ, కుంభాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆలయంలో ధ్వజస్థంభానికి, బలిపీఠాలకు ఇత్తడి కవచాలను అమర్చారు. ఆలయ ప్రధాన పూజారి మాధవన్ నంబూద్రి ఆధ్వర్యంలో అంగరంగ వైభవోపేతంగా అయ్యప్పస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావులు స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ కమీషనర్ సుజాత, శ్రీనివాసకాలనీ దేవస్థానం ట్రస్టు చైర్మన్ కొత్తా వెంకటేశ్వరరావు, చావా కిషోర్, 45, 46 డివిజన్ కార్పోరేటర్లు డి. నరేష్, కొత్వాల విమలాదేవి, కేశబోయిన కోటేశ్వరరావు, మారుతీ నాగేశ్వరరావు, బేతంశెట్టి వెంకట్, డి. రాము, రామాచారి, ఎన్‌పి. చారి, బాబూచారి, మహేష్‌కుమార్, మల్లాల నాగేందర్, భట్టు మంజుల తదితరులు పాల్గొన్నారు.

## భార్యను హత్యచేసిన భర్తకు 7 ఏళ్ల జైలు శిక్ష

**ప్రజాపక్షం/కారేపల్లి:** క్షణికావేశంలో భార్యను హత్య చేసిన భర్తకు 7 సంవత్సకాల జైలు శిక్షతో పాటు రూ 5వేల జరిమానా విధిస్తూ 4వ అదరపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి(ఫ్యామిలీ కోర్టు)ఎం అర్చన కుమారి తీర్పు వెలువరించారు. ఈవిషయంపై వివరాలు ఇలా ఉన్నాయి. 2025 ఫిబ్రవరి 20న మధ్యప్రదేశ్ రాష్ట్రంలో దిండోరి ప్రాంతానికి చెందిన కమలేష్ మరావి(38)తన భార్య పింకీ మాధవితో కలిసి మిర్చి కోత పనుల నిమిత్తం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కారేపల్లి మండలం లక్ష్మీ పురం, జైత్రం తండా పంచాయితీ సమీపంలో ఇతర కూలీలతో కలిసి నివసిస్తున్నారు. ఆ రోజు ఉదయం భార్యాభర్తల మధ్య జరిగిన గొడవలో క్షణికావేశానికి లోనైన కమలేష్ తన భార్యను తీవ్రంగా కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భాదితుల ఫిర్యాదు మేరకు కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైం నం 45/2025గా కేసు నమోదు చేశారు. అనంతరం సెక్షన్ 105 బిఎన్ఎస్ చట్టం కింద దర్యాప్తు చేసి, ఎస్‌సీ నెంబర్ 78/2025గా కోర్టులో అభివియోగ పత్రం దాఖలు చేశారు. పోలీసుల సమగ్ర దర్యాప్తు, సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నిందితుడిపై మోపిన అభియోగం రుజువైనట్లు తేల్చి 7 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ 5వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఈ కేసులో అప్పటి విచారణ అధికారులు ఇన్స్పెక్టర్ బి తిరుపతిరెడ్డి, ఎస్ఐ రాజారాం, అదరపు ప్రభుత్వ న్యాయవాది పి స్వప్న, కోర్టు డ్యూటీ ఆఫీసర్/హెడ్ కానిస్టేబుల్ టి వెంకటేశ్వరరావు, కోర్టు లైజనింగ్ ఎస్ఐ కె శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుల్ కె శ్రీనివాసరావు, హోంగార్డ్ శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్‌కు సహకరించారు. కేసు విజయవంతంగా విచారణ పూర్తయ్యేందుకు కృషి చేసిన పోలీసు సిబ్బందిని పోలీస్ కమీషనర్ సునీల్ దత్ అభినందించారు.

## గ్రామసభలు విజయవంతం చేయాలి

**- కలెక్టర్ అంకిత్**




**ప్రజాపక్షం/ కొత్తగూడెం:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యచరణలో భాగంగా గ్రామసభలు విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయితీల్లో గ్రామసభలు, మున్సిపల్ పట్టణాల్లో వార్డు సభలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని సభలకు హజరయ్యే ప్రజలకు తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. సభలకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ఇందుకు సంబంధించి ప్రతీ శాఖ నివేదికలు సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యా శాఖ కార్యక్రమాలు సమర్ధవంతంగా నిర్వహించాలని, వ్యవసాయశాఖ రైతులకు లాభదాయక పంటలు, ఉద్యాన పంటలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఏప్రిల్ 2 నుండి జిల్లాలో వివిధ శాఖలపై ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు సమయానికి గ్రామసభలకు సమయానికి హాజరై స్థానిక సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు.

## 7వ రోజుకు చేరిన కాంట్రాక్ట్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు 7వ రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా బెల్లం నాగయ్య(జేఏసీ కో కన్వీనర్), కుమ్మరికుంట్ల రాంబాబు, రెంటాల కృష్ణ, ఆకిని చంద్రరావు దీక్షలో కూర్చున్నారు. వారికి ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు మారం వెంకటేశ్వరరెడ్డి పూలమాల వేసి దీక్షను ప్రారంభించి సంఘీభావం తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో కన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, షేక్ యాకూబ్ పాషా, జేఏసీ సభ్యులు ఆకిని సర్వేశ్వరరావు, కాలువ మోహన్, పాల్గొన్నారు.

## బూర్గంపాడు అభివృద్ధికి ఎంఎల్‌ఏ పాయం కృషి

**-రూ 50లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు శంకుస్థాపన**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు గ్రామ అభివృద్ధికి ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవ చూపుతూ సుమారు రూ 50లక్షల వ్యయంతో పలు సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి మంజూరు కల్పించారు. ఈ అభివృద్ధి పనులకు బుధవారం గ్రామ పంచాయితీ సర్పంచ్ మందా నాగరాజు, ఉప సర్పంచ్ గుండె వెంకన్న శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ మందా నాగరాజు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. గ్రామంలోని పలు కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడంతో రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు పారిశుద్ధ్య పరిస్థితులు కూడా మెరుగవుతాయని అన్నారు. గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లుకు గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉప సర్పంచ్ గుండె వెంకన్న మాట్లాడుతూ గ్రామానికి మరిన్ని అభివృద్ధి పనులు తీసుకురావడానికి కృషి చేస్తామని చెప్పారు. ప్రజల అవసరాలను గుర్తించి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్, ప్రముఖ న్యాయవాది భజన సతీష్ కుమార్, పంచాయితీ కార్యదర్శి బర్ల ప్రభాకర్, ఏఈ బోయపల్లి చక్రధర చారి, నాయకులు భజన ప్రసాద్ కుమార్, చిప్పారాజు, గుద్దేటి ప్రవీణ్ కుమార్, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ జిల్లా సమితి సభ్యుడిగా పొత్తియ శ్రీనివాసరావు ఎన్నిక



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** మండలంలోని మంగాపురం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు పొత్తియ శ్రీనివాసరావు సిపిఐ ఖమ్మం జిల్లా సమితి సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఇటీవల నిర్వహించిన పార్టీ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు ఆయనను జిల్లా సమితి సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగాపురం గ్రామం నుండి పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేస్తున్న కృషిని గుర్తించి పార్టీ ఈ బాధ్యతను అప్పగించింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో జిల్లా సమితి సభ్యుడిగా అవకాశం కల్పించిన జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ ఆశయ సాధనకు, పేద ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా బెజ్జం కుటుంబ వివాహ వేడుక



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని మోరంపల్లిబంజర్ గ్రామ పంచాయితీ పరిధిలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో బెజ్జం వెంకటరామి రెడ్డి, సైదమ్మ దంపతుల ప్రథమ పుత్రుడు శ్రీనివాసరెడ్డి వివాహం సంయుక్తతో సాంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో వివాహ వేడుక ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ఈ వివాహ వేడుకకు బూర్గంపాడు మండల మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డి దంపతులు హాజరై నవ దంపతులకు అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన దంపతులు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మోరంపల్లిబంజర్ గ్రామ కమిటీ అధ్యక్షులు కైపు ఖగేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మేడం లక్ష్మీ నారాయణరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షులు చేతులపెద్ద వీర్రాజు, మాజీ వార్డు సభ్యురాలు కామిరెడ్డి పద్మ, నాయకులు కైపు సుబ్బిరామిరెడ్డి, మూల బాలిరెడ్డి, కురుకుంట్ల చిన్నప్పరెడ్డి, గంగుల చంద్రశేఖర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు ఏనుగుల వెంకటరెడ్డి, గుగులోత్ బాలు నాయక్, బెజ్జం శ్రీనివాసరెడ్డి, చుక్కపల్లి బాలాజీ, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

# నేటి తరానికి వెంకటలాలయ్య సేవలు తెలియాలి

## సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం



**ప్రజాపక్షం/కొణిజర్ల :** యాసా వెంకటలాలయ్య గ్రామానికి చేసిన సేవలు నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ జాతీయసమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. మండల పరిదిలోని తనికెళ్లలో తనికెళ్ల గ్రామ ప్రథమ సర్పంచ్ యాసా వెంకటలాలయ్య 36వ వర్ధంతి కార్యక్రమం బుదవారం ఘనంగా నిర్వహించారు. సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బాగం హేమంతురావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి ముఖ్య అతిధిలుగా పాల్గొని ప్రసంగించారు. దళితులు గ్రామానికి దూరంగా ఉండటంతో పార్టీ నిర్ణయానికి కట్టుబడి రాష్ట్రీయప్రధాన రహదారిప్రక్కన గల 12 ఎకరాల వ్యవసాయభూమిని ఇండ్ల స్థలాలకు ఇచ్చిన ఘనత ఆయనదని పేర్కొన్నారు. తాగునీటికి ఇబ్బందిపడుతున్న రోజుల్లో తన సొంతడబ్బుతో వడ్డెరకాలనీ, గౌడ్‌బజార్, గొల్లబజార్, ఎస్సీ కాలనీయందు బావులు తవ్వించి నీటిఎద్దడిని తగ్గించిన వ్యక్తి అని కొనియాడారు. ఇప్పటికి ఆయన వర్ధంతికి కులమతాలకు అతీతంగా ఇంతమంది హాజరయ్యారంటే ఆయనకు ప్రజల్లో ఉన్న స్థానమేంటో అర్థం చేసుకోవచ్చని అన్నారు. గ్రామంలో విద్యాభివృద్ధికోసం విశాలమైన స్థలాలను సిపిఐ పార్టీపరంగా విద్యాశాఖకు అప్పగించారని అధికారంలో లేకున్నా ఈగ్రామంలో సుమారు వంద ఎకరాల ఇండ్లస్థలాలను పంచిపెట్టిన ఘనత కమ్యూనిస్టుపార్టీకే దక్కిందని అన్నారు. కమ్యూనిస్టులు ఉనికిలేకపోతే పేదప్రజలకు న్యాయం జరగదని ప్రశ్నించేవారు లేకుండా పోతున్నారని ఇది దేశానికి అత్యంత ప్రమాదకరమని కమ్యూనిస్టు నాయకులు చెప్పడం కాదు బూర్జువాపార్టీల మేధావులు సైతం దీన్ని అంగీకరిస్తున్నారని తెలిపారు. చుట్టుప్రక్కల గ్రామాలకు బలమైన కేంద్రంగా తనికెళ్ల ఉండేదని అన్నారు. తనికెళ్లలోని ప్రజలు సిపిఐ ని గెలిపించుకుంటేనే గ్రామం అభివృద్ధి చెందుతుందని సిపిఐ పంచాయతీ ఎన్నికల్లో గెలిపించారని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు యర్రా బాబు, దొండపాటి రమష్, మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య, సిపిఐ జిల్లా నాయకులు పివిరావు, పెదమళ్ల రత్తమయ్య, ఉపాధ్యాయసంఘం నాయకులు లేడిబోయిన గోపాల్‌రావు, విశ్రాంత ఉపాధ్యాయుడు కొణపర్తి విష్ణుమూర్తి, వెంపటి పరుశురాములు, పిన్నం పుల్లయ్య, పాపిట్ల ఏసు, కవిడ వీరభద్రం, గడదాసు శ్రీను, వెంకటలాలయ్య కుమారులు యాసా వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

# పేదలందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

## -భూదాన్ బాధితులతో ఎన్‌డి సదస్సు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వెలుగుమట్ల భూదాన్ భూముల్లో స్థలాలు కోల్పోయిన పేదలందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు తెలిపారు. సిపిఐ (ఎంఎల్)ఎన్డి కార్యాలయంలో వెలుగుమట్ల భూదాన్ బాధితులతో ఎన్డి ఖమ్మం జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య అధ్యక్షతన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో ఆవునూరి మధు మాట్లాడుతూ 62 ఎకరాల భూదాన్ భూమికి తక్షణమే భూదాన్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అప్పజేప్పిన 30 ఎకరాల భూదాన్ భూమిని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పేదలు గుడిసెలు వేసుకున్న ప్రదేశాన్ని పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు బుల్‌డోజర్లు, జేసిబిలతో నేలమట్టం చేశారని సుప్రీం కోర్టు స్టేటస్ కో ఇచ్చినప్పటికి అది పట్టించుకోకుండా అధికారులు కూల్చివేశారన్నారు. ఇండ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇవ్వకుండా కూల్చివేసిన స్థలంలో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పి 311 మందికి ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. భూదాన్ భూముల్లో ఇండ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికి స్థలాలు ఇచ్చి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితులతో పాటు వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణ చేపడతామని తెలిపారు. బాధితులు కూరపాటి రామారావు, రామాంజనేయులు, ఖదీర్, పాషా, జయమ్మ,ఆంజనేయులు, పుల్లమ్మ, సత్యావతి, ఎన్డి రాష్ట్ర నాయకులు మందుల రాజేంద్రప్రసాద్, డివిజన్ కార్యదర్శి లక్ష్మి నారాయణ, బజ్జూరి వెంకట్రామిరెడ్డి, వై. ప్రకాష్, గిరి, లక్ష్మి, జానకి తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి

## -ఖమ్మం డిపో ఎదుట జేఏసి ఆధ్వర్యంలో నిరసన

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కార్మిక హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆర్టిసి ఖమ్మం డిపో జేఏసి నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు, టిజిఎస్ ఆర్టిసి జేఏసి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఖమ్మం డిపో జేఏసి ఆధ్వ్యంలో బుధవారం ఉదయం ఖమ్మం డిపో ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నాయకులు, విధులకు హాజరయ్యే కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసి నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తుందన్నారు. కార్పొరేట్ శక్తులకు ఊతమిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడం తగదన్నారు. వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసి రాష్ట్ర నాయకులు పాటి అప్పారావు, ఖమ్మం రీజియన్ జేఏసి



నాయకులు ఎల్‌ఆర్‌కె రావు, బి. శ్రీనివాసరెడ్డి, ఖమ్మం డిపో జేఏసి నాయకులు బేతంపూడి బుచ్చిబాబు, బి. కోటయ్య, దామాల లాజర్, ప్రదీప్ కుమార్, అరుణ కుమారి, రామకృష్ణ, విజయకుమార్, యాదగిరి, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రీజియన్ కార్యదర్శి పిట్టల సుధాకర్, డిపో కార్యదర్శి రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

# కోల్డ్‌స్టోరేజీ బాధిత రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించాలి



**ప్రజాపక్షం/మధిర :** మండల పరిధి ఆత్కూరులోని సాయిబాలాజీ కోల్డ్ స్టోరేజి బాధిత రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం నందు తహశీల్దార్ రాంబాబుకు వినతిపత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ సాయిబాలాజీ కోల్డ్‌స్టోరేజిలో నష్టపోయిన రైతులకు వెంటనే బీమా ఇన్సూరెన్స్ అందించాలని, దీని కోసం అధికారులు ఇన్సూరెన్స్ కంపెనీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వందలాది మంది రైతులు కోల్డ్ స్టోరేజి దగ్ధం కావడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని, రైతులు కుటుంబాల్లో తమ పిల్లల పెళ్లిళ్లు, హాస్పటల్ ఖర్చులు, వ్యవసాయానికి అధిక వడ్డీలకుఅప్పులు చేసి ఉన్నారని, ఈ సంఘటన వలన రైతులు ఆందోళన చెందుతున్నారని, ప్రభుత్వాధికారులు చర్యలు తీసుకుని నష్టపరిహారం వెంటనే అందించాలని కోరారు. ఈ నెల 5వ తేదీన మధిరలో సాయిబాలాజీ కోల్డ్ స్టోరేజి ద్వారా నష్టపోయిన రైతుల సమావేశం నిర్వహించనున్నట్లు, ఈ సమావేశానికి వచ్చేటప్పుడు రైతులు బాండు, ఆధార్ కార్డు జికార్స్‌ను తీసుకుని హాజరుకావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు దొండపాటి నాగేశ్వరరావు, దివ్వేల వీరయ్య, రైతు సంఘం డివిజన్ కార్యదర్శి పాపినేని రామనర్సయ్య, సిఐటియు నాయులు పడికంటి మురళీ, రైతులు పాల్గొన్నారు.

# సిపిఐ సభ్యత్వ నమోదు ప్రారంభం



**ప్రజాపక్షం/కొణిజర్ల :** భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కొణిజర్ల మండలం తుమ్మలపల్లి గ్రామంలో సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం సిపిఐ జిల్లా నాయకులు యర్రా బాబు ప్రారంభించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు పేద ప్రజల సమస్యల పరిష్కారానికి, రైతుల సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టుల అవసరం మరింత పెరిగిందని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు కమ్యూనిస్టు నాయకత్వంవైపు చూస్తున్నారని అన్నారు. కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో మమేకమై పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కట్ల సత్యం, మాజీ ఎంపిటిసి ఎస్‌కె సైదులు, సీనియర్ నాయకులు బొడ్డుపల్లి కోటేశ్వరరావు, బండారు కృష్ణయ్య, గడల శ్రీనివాసరావు, మన్నెం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధి లోని మంచుకొండ గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. బుధవా రం గ్రామంలో బొడ్రాయి వద్ద సిసి రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ తేజావత్ శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముకుందమ్మ బిక్షం, వార్డు సభ్యులు వల్లభనేని లత పుల్లయ్య, ప్రవళిక రవి, అర్వపల్లి కృష్ణ, చిన్న రామారావు, మందా వెంకన్న, స్థానిక నాయకులు మందడపు మాధవరావు, భూక్యా లక్ష్మణ్ నాయక్, వాంకుడోత్ దీప్లానాయక్, భూక్యా రాము నాయక్, వల్లభనేని రమేష్, అర్వపల్లి రాఘవేంద్రరావు, తేజావత్ రమేష్, లాలు, అజయ్, మోహన్, భద్రు, శ్రీను, సుక్య పాల్గొన్నారు.

# సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని 46వ డివిజన్‌లో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. బుధవారం డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధులు రూ. 29.50 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు మేయర్ పునుకొల్లు నీరజ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఖమ్మం నగరంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు ఆమె తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. అన్ని డివిజన్లకు ప్రాధాన్యతకల్పిస్తూ అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది చేకూరుస్తున్నామన్నారు. నిర్మాణ పనులు త్వరిత గతిన నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ, డివిజన్ అధ్యక్షులు షేక్ రజ్జీ, బానాల లక్ష్మణ్, అధికారులు పాల్గొన్నారు.

# నల్లబ్యాడ్జీలతో ఆర్టిసి కార్మికుల నిరసన




**ప్రజాపక్షం/ మధిర :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను తీవ్రంగా వ్యతిరేకిస్తూ మధిర డిపో ఆధ్వర్యంలో బ్లాక్‌డేలో భాగంగా బుధవారం ఆర్టిసి కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసి నాయకులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కార్మికుల సంక్షేమానికి విరుద్ధంగా ఉన్న ఈ లేబర్ కోడ్‌లు అమలు చేస్తే ఉద్యోగ భద్రత, వేతన హక్కులు తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక వర్గాలపై భారాన్ని మోపే ఈ నిర్ణయాలను ప్రభుత్వం పునారలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగుల్ మీరా, కె.అరుణకుమారి, రామచంద్ర, కె.వెంకన్న, జె.పద్మావతి, ఎం.నర్సింహారావు, ఎస్.అరుణకుమారి, హరికృష్ణ, రామారావు, టి.శ్రీనివాసరావు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న అచీవ్‌మెంట్ ఎగ్జిబిషన్



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన స్టూడెంట్ అచీవ్మెంట్ ఎగ్జిబిషన్ కార్యక్రమం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ఎం.రవీంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులు, మోడల్స్, ఎగ్జిబిట్స్, సృజనాత్మక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. కళాశాల సిబ్బంది విద్యార్థులతో పాటు సమీప జూనిర్ కళాశాల నుండి వచ్చిన విద్యార్థులు ఈ ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు డిగ్రీ స్థాయి విద్య అందుబాటులో ఉన్న సదుపాయాలు, ప్రయోగశాలలు, లైబ్రరీ, భవిష్యత్ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల విద్యార్దులు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.అరుణ, అధ్యాపకులు ఇందిర, సుజాత, వి.నాగరాజు, కె.రామకృష్ణ, పి.శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, షేక్.ఇమ్రాన్, కె.వెంకటేష్ హరిక, ఎస్.జ్యోతి, ఇతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పన్ను వసూళ్లలో వైరా ప్రథమం




**-కామేపల్లి అధమం**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** గ్రామ పంచాయతీ పన్ను వసూళ్లలో వైరా మండలం ప్రథమ స్థానంలో నిలిచింది. కొణిజర్ల మండలం ద్వితీయ స్థానంలో నిలవగా కామేపల్లి మండలం కేవలం 86 శాతంతో అట్టడుగున నిలిచింది. గ్రామ పంచాయతీలో పన్నుల వసూళ్లపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఖమ్మం జిల్లాలోని 571 పంచాయతీలకు గాను గ్రామ పంచాయతీలలో పన్నుల వసూళ్ల కార్యక్రమాన్ని చేపట్టింది. బకాయిలతో పాటు ఈ ఏడాది గ్రామ పంచాయతీల పన్ను వసూళ్లపై దృష్టి సారించింది. 22 గ్రామ పంచాయతీలు ఉన్న వైరా మండలం 95 శాతం వసూళ్లతో ప్రథమ స్థానంలో నిలిచింది. కొణిజర్ల మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉండగా 94 శాతం వసూళ్లు సాధించింది. కామేపల్లి మండలంలో 24 గ్రామ పంచాయతీలకు గాను కేవలం 86 శాతం మాత్రమే వసూళ్లు చేశారు. తిరుమలాయపాలెం 92 శాతం, నేలకొండపల్లి, ఎర్రుపాలెం మండలాల్లో 91 శాతం వసూళ్లయ్యాయి. ముదిగొండ, సత్తుపల్లి, సింగరేణి, ఏన్కూరు, కూసుమంచి మండలాల్లో 90 శాతం పన్ను వసూళ్లయ్యాయి. కల్లూరు, మధిర, రఘునాథపాలెంలో 89 శాతం, తల్లాడలో 88 శాతం, వేంసూరు 88 శాతం, బోనకల్, చింతకాని, పెనుబల్లిలో 87 శాతం పన్ను వసూలు చేశారు. గతేడాదితో పోల్చుకున్నప్పుడు పన్నుల వసూళ్లలో మంచి పురోగతి సాధించడం జరిగింది.

## మంగళ తోరణాలతో ప్రారంభమైన అంకమ్మ జాతర



**ప్రజాపక్షం/ తల్లాడ :** మండల పరిధిలోని అన్నారుగూడెంలో ఐదు రోజులు అంకమ్మ జాతర జరగనున్న నేపథ్యంలో మొదటిరోజు బుధవారం ఉదయం మంగళతోరణాలతో విఘ్నేశ్వర పూజతో ఎంతో వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ గొర్ల ప్రభాకర్‌లు పాల్గొని తోరణపాక కట్టి దేవాలయానికి అలంకరించారు. అనంతరం వారు జాతర కమిటీ సభ్యులతో మాట్లాడి జాతర సజావుగా జరిగేలా చూడాలని కమిటీని వారు కోరారు. అంతేకాకుండా రాత్రి జరగబోయే అమ్మవార్ల ఊరేగింపు ఘనంగా జరగాలని, ఎక్కడ అవాంతరనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు అంకమ్మ జాతర కమిటీ వారియర్స్ పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈ ఐదు రోజులు జరిగే జాతర జిల్లాలోనే మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చేలా ఉండాలని కమిటీకి వారు సూచించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ దొడ్డ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దొడ్డ నిర్మల, జాతర కమిటీ సభ్యులు దొడ్డ చిన్నశ్రీనివాసరావు, మారెళ్ళ దేవేందర్, తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, దొబ్బల శ్రీనివాసరావు, పేరసాని నర్సింహారావు, దుగ్గినేని సత్యనారాయణ, దొబ్బల శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, రైతులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వైరాలో ప్రారంభమైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం



**-నూతన టెక్నాలజీతో పిల్లర్ బెడ్ ఏర్పాటు**
**- నాణ్యతతోనే పనులు**
**-నిత్యం పనుల పర్యవేక్షణ చేస్తున్న అధికారులు**





**ప్రజాపక్షం/వైరా:** వైరాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులుశరవేగంగా సాగుతున్నాయి. అత్యంత నూతన టెక్నాలజీతో ఈ పనులను చేపడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్‌తో పనుల విషయంలో నిత్యం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ నాణ్యత పరిణామాలపై సూచనలు చేస్తున్నారు. నూతన టెక్నాలజీతో భవన నిర్మాణాలకు అత్యంత బలమైన పునాదిగా ఉండేందుకు పిల్లర్స్ బెడ్‌ను ఏర్పాటు చేశారు. ఇది ఎంతో గట్టిగా ఉంటుందని నూతన టెక్నాలజీ ద్వారా ఈ బెడ్ ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి రూ.200కోట్లను తెలంగాణ ప్రభుత్వం కేటాయించింది. రూ.200కోట్ల నిధులతో చేపట్టిన భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని గురుకుల పాఠశాలలను ఒకే వేదికగా ఒకే ప్రాంతంలో ఎలాంటి తారతమ్యాలు లేకుండా ఉండేవిధంగా ముందు చూపుతో చేపట్టిన కార్యక్రమమే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ కార్యక్రమం. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనాల నిర్మాణంకు ఉపయోగించే కంకర, ఇసుక, డస్ట్ ఎప్పటికప్పుడు భవనాల నిర్మాణం వద్ద డంపు చేసి ప్రాంతంలో పూర్తిగా పర్యవేక్షణ చేసిన తర్వాతే వాటిని డంప్ చేయిస్తున్నారు. క్వాలిటీ విషయంలో ఎక్కడ ఇబ్బంది రాకుండా ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేశారు. డిఈ సాంబయ్య, ఏఈ సురేస్ నిత్యం పరిరక్షణ చేస్తూ ఉన్నారు. ఎందుకంటే వేలాది మంది పిల్లలు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం అయితే చదువుకుంటారు. ఎక్కడ ఎలాంటి చిన్న నష్టం కూడా జరగకుండా నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులు చేపడుతున్నారు.

## బాలామృతం, కోడిగుడ్లను క్రమం తప్పకుండా తీసుకోవాలి





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో 12వ వార్డులో నూతన విద్యుత్ లైన్‌లో ఏర్పాటు కార్యక్రమం బుదవారం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బంది చేస్తున్న పనులను వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్ దగ్గర ఉండి పలు సూచనలు చేస్తున్నారు. అనంతరం ఏప్రిల్1వ తేదిన అంగన్‌వాడీ కేంద్రం నందు చదువుతున్న బాలబాలికల తల్లులకు గర్భిణీ స్త్రీలకు పోషక ఆహార నిమిత్తం బాలమృతం, కోడిగుడ్లు కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాదినేని సునీత మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ లైన్ ఏర్పాటు జరుగుతుంది. ఎక్కడ ఇబ్బంది కలగకుండా ఉండేవిధంగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ లైన్ సమస్యలను ఉంటే నా దృష్టికి తీసుకురావాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలకు చిన్న పిల్లలకు అందించే బాలమృతం కోడిగుడ్లను సక్రమంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుజాత, ఆశా వర్కర్ మహేశ్వరి పాల్గొన్నారు.

## చిన్నారులకు అక్షరాభ్యాసం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 11వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ దొంతబోయిన వెంకటేశ్వర్లు చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని చేపించారు. అనంతరం పిల్లలకు బాలామృతాన్ని కోడిగుడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దొంతెబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు అక్షరాభ్యాసం నేర్పించడం ఎంతో సంతోషకరమని, అంగన్‌వాడీ కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది కౌన్సిలర్ దొంతెబోయిన వెంకటేశ్వర్లు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



**ప్రజాపక్షం/ బోనకల్ :** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు బోనకల్ మండలం కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఖమ్మం సెంటర్లో బ్లాక్ డే నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సిఐటియు జిల్లా నాయకులు బోయినపల్లి వీరబాబు, మండల కన్వీనర్ నరేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వలన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమాన పనికి పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనం పెంచాలని, ఈ నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులకు పిఎఫ్, ఈఎఫ్ సౌకర్యం కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఈ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌసుద్దీన్, మాగంటి బాబు, తాళ్లూరు డేవిడ్, ఎస్కే సైదా, ఎస్కే వలీ, నర్సింహారావు, రాంబాబు, ఆనందరావు, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలను రద్దు చేస్తే సహించేది లేదు




**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తే సహించేది లేదని సిఐటియు జిల్లా నాయకులు మద్దాల ప్రభాకర్‌రావు ప్రభుత్వాలను హెచ్చరించారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం రింగ్ సెంటర్ నందు కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశ వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన బ్లాక్ డే కార్యక్రమంలో భాగంగా గ్రామపంచాయతీ కార్మికులు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, వివిధ రంగాలకు సంబంధించిన పలువురు కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను ఏప్రిల్ 1వ తేదీ నుండి దేశవ్యాప్తంగా అమలు పర్చాలని సిద్ధం చేసిందని, దానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. నాలుగు లేబర్ కోడ్‌లను అమలు జరపకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో రానున్న కాలంలో పెద్దెత్తున కార్మిక వర్గాన్ని సమీకరించి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కో ఆర్గనైజేషన్ దూదిగం, బసవయ్య, బేతి శ్రీనివాసరావు, గంతాల నాగేశ్వరరావు, నంద్రు సుధారాణి, హైమావతి, విజయలక్ష్మి , దూదిగం శ్రీను, రామకృష్ణ, నక్క పుల్లారావు, చిన్న నగేష్, ఈశ్వరమ్మ, మల్లేశ్వరి, వివిధ సంఘాలకు సంబంధించిన కార్మికులు పాల్గొన్నారు.

## పన్నులు వసూళ్లలో జిల్లాలోనే వైరా ప్రథమ స్థానం

**ఎంపివో రాజేశ్వరికి పలువురు అభినందనలు**



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లాలో గ్రామపంచాయతీ పన్నులు వసూలు చేయడంలో వైరా మండల ప్రథమ స్థానంలో నిలవగా, కొణిజర్ల మండలం ద్వితీయ స్థానంలో నిలిచింది. వైరా మండలంలో 22 గ్రామపంచాయతీలో గాను రూ.3523104లు గ్రామ సెక్రటరీ వసూలు చేశారు. పంచాయతీ పన్నులు వసూళ్లలో వైఅ జిల్లాలో ప్రథమ స్థానం ఉండటంతో ఎంపివో రాజేశ్వరి కృషి ఎంతో ఉందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సక్రియ అన్నారు. రాజేశ్వరి నిత్యం పంచాయతీ సెక్రటరీతో ప్రతిరోజు రివ్యూ నిర్వహిస్తూ టాక్స్ వసూళ్లలో ఎక్కడ నిర్లక్ష్యం చేయకుండా పలు సూచనలు చేస్తూ లక్ష్యాన్ని సేదించే దిశగా ప్రోత్సహించారని ఎంపిడివో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపివో రాజేశ్వరికి పలువురు అభినందనలు తెలిపారు. వైరా మండలం నాలుగు గ్రామపంచాయతీలో 100% వసూళ్లు, 18 గ్రామ పంచాయతీలు 95% వసూలు చేయడంలో ఇటు సెక్రటరీలు ఎంపివో ఎంతో కృషి చేశారని పలువురు తెలిపారు. జిల్లాలోనే వస్తువుల్లో ప్రథమ స్థానం వైరా మండలం ఉండటం జిల్లాస్థాయి అధికారులు పలువురు అభినందిస్తున్నారు.

## హెచ్‌పివి వ్యాక్సిన్ ప్రారంభం

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌పివి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని బుధవారం మధిర ఎఎంసి చైర్మన్ బండారు నర్సింహారావు, డాక్టర్ ప్రశాంత్ ప్రారంభించారు. బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్ కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది, అన్ని గ్రామాల సర్పంచ్‌లు, వివిధ పక్షాల రాజకీయ నాయకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ మహిళలకు గర్భాశయ ముఖ ద్వారా, ఇతర హెచ్‌పివి క్యాన్సర్లను నిరోధించడానికి అత్యంత ప్రతిభావంతమైన టీకా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం గ్రామ సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి, బనిగండ్లపాడు సర్పంచ్ బొలుసుపాటి జయరాజు, ఉపసర్పంచ్ రామిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, చావా రామకృష్ణ, అనుమోలు కృష్ణారావు, శీలం శ్రీనివాస్‌ఱెడ్డి, కంచర్ల వెంకటనర్సయ్య, తల్లపురెడ్డి నాగిరెడ్డి. ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాగులో ఉన్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి

**- నిరుపేద సాగుదారులను ఇబ్బందులు పెట్టొద్దు**
**- అధికారులు స్పందించకుంటే పోరాటం**
**- సిపిఐ జిల్లాకార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/కొత్తగూడెం :** నిరుపేద పోడుసాగు దారులను అటవీ అధికారులు ఇబ్బందులకు గురిచెయ్యరాదని, పేదలకు ఉపాధి లేకుండా చేసే కార్యక్రమాలకు స్వస్తి చెప్పి సహకరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన అటవీ అధికారులకు వినతి పత్రం అందించి పోడు రైతుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ బందెగిరిన గర్ తో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏజెన్సీ గ్రామాల పరిధిలో ఏళ్లుగా భూమిని నమ్ముకుని బతుకుతున్న పేదల సాగుభూముల్లో కందకాలు తవ్వుతూ మొక్కలు నాటుతూ వారి ఉపాధిని దెబ్బతీయడం న్యాయం కాదన్నారు. అనాదిగా పేదల సాగులో ఉన్న పోడు భూములకు తక్షణమే చట్టబద్ధమై హక్కు పత్రాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జిలాల్లో ఇప్పటికే అనేక ప్రాంతాల్లో పోడు భూముల సర్వే పూర్తయినప్పటికీ అర్హులైన పేదలకు హక్కు పత్రాలు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. సర్వే పూర్తయిన ప్రతీ ఎకరాకు వెంటనే పట్టాలు పంపిణీ చేయాలని, పేదలు స్వేచ్ఛగా సాగుచేసుకునే వెసులుబాటు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కొత్తగా పోడు చేసే విధానాన్ని సిపిఐ తొలినాళ్ల నుండి వ్యతిరేఖిస్తోందని, అయితే తరాలుగా పోడుపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న గిరిజన, గిరిజనేతర పేదలకు మాత్రం పత్రాలు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. అటవీ చట్టాల పేరుతో పేదల పొట్ట కొట్టాలని చూస్తే సహించేదే లేదని, సాగుదారులకు రక్షణ కల్పించే వరకు సిపిఐ అండగా ఉంటుందన్నారు. అధికారులు తమ వైఖరిని మార్చుకోక పోతే జిల్లా వ్యాప్తంగా పోడురైతులను ఏకం చేసి పెద్దెత్తున ఉద్యమాలు చేపడతామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి నర్సింహా, తాటి ఎల్లయ్య, సున్నం పాపారావు, ఆదిలక్ష్మి , వెంకటేశ్వర్లు, కుంజా వెంకటేష్, పడిగె సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రియుడి మోజులో పడి భర్తను హత్య చేసిన భార్య ?

**- అనాథలైన పిల్లలు**



**ప్రజాపక్షం/పాల్వంచ :** తమ వివాహ సమయంలో జీవిత కాలం కలిసి ఉంటామని ప్రమాణం చేసుకొన్న ఆ దంపతులు కొంత కాలం వరకు అన్యోన్యంగా జీవించారు. వారికి ఇద్దరు పిల్లలు. అనంతరం తన సుఖం కోసం క్రిష్ణవేణి మరో వ్యక్తి మోజులో పడింది. దీనితో వారి కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతుండేవి. దీనితో ఆమె తన భర్తతో విడిపోయి తన ఇద్దరు పిల్లలో తన ప్రియుడితో కలిసి జీవనం సాగిస్తున్నది. తన పిల్లలను చూసుకోవటానికి వెళ్ళిన భర్తపై తన ప్రియుడు మరి కొందరితో కలిసి దాడికి పాల్పడ్డారు. ప్రియుడి మోజులో పడి ఓ మహిళ తన భర్తను హత్య చేసిన సంఘటన మంగళ వారం రాత్రి వెలుగులోకొచ్చింది. స్థానికులు తెలిపిన ప్రకారం మండల పరిధి సత్యనారాయణపురం (మొండికట్ట ) గ్రామానికి చెందిన గండి కోట ప్రసాద్ (32 ) గత సంవత్సరం క్రితం తన భార్య క్రిష్ణవేణి, పిల్లలతో కలిసి జీవనోపాధి కోసం హైదరాబాద్ గౌల్‌దొడ్డికి వెళ్ళాడు. ఈ క్రమంలో ప్రసాద్ భార్య మరో వ్యక్తితో అక్రమ సంభంధం పెట్టుకొన్నది. ఈ విషయం తెలిసిన భర్త తన భార్యను మందలించాడు. అయినా ఆమెలో మార్పురాలేదు. ఇరువురి మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. దీనితో ఆమె తన భర్తను వదిలేసి తన ఇద్దరు పిల్లలతో కలిసి తన ప్రియుడి వద్దకు చేరుకొని సహజీవనం సాగిస్తున్నది. గత కొన్ని రోజుల క్రితం ప్రసాద్ తన భార్య క్రిష్ణవేణికి నచ్చజెప్పి తిరిగి తీసుకురావటానికి వెళ్ళాడు. ఈ క్రమంలో వారి మధ్యన వివాదం రేగింది. కోపోద్రిక్తులైన క్రిష్ణవేణి, ఆమె ప్రియుడు, మరి కొందరితో కలిసి ప్రసాద్‌పై దాడి చేశారు. ఇష్టారీతిన పిడి గుద్దులు కురిపించారు. దెబ్బలు తాళలేక వెనుదిరిగాడు. అనంతరం తన స్వగ్రామం మొండికట్టకు చేరుకొన్నాడు. ఇక్కడ నుండి పని కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చింతూరుకు వెళ్ళాడు. పని చేస్తున్న క్రమంలో కడుపులో విపరీతమైన నొప్పి రావటంతో తోటి వారు భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ సరైన వైద్య సదుపాయం లేదనటంతో కొత్తగూడెం లోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తీసుకెళ్ళారు. తీసుకొన్నాడు. పలు రకాల టెస్టులు నిర్వహించిన వైద్యులు కండీషన్ సీరియస్‌గా ఉందని హైదరాబాద్‌కు తీసుకెళ్ళాలని చెప్పారు. బాదితుడి కుటుంబ సభ్యుల అగ్రిమెంట్‌తో వైద్యులు చికిత్స ప్రారంభించారు. ఈ క్రమంలో కడుపులో పేగులు కమిలిపోయాయి. ఓ పేగు పగిలిపోయినట్లు వైద్యులు గుర్తించారు. వైద్యం అందిస్తుండగానే ప్రసాద్ మృతి చెందాడు.

**అనాథలైన పిల్లలు :** తమ కన్న పిల్లలను పెంచి పద్ద చేసి ప్రయోజకులను చేయాల్సిన తల్లిదండ్రులలో కరు మృతి చెందగా, తల్లి జైలుపాలు కానున్నది. కట్టుకున్న భర్తను కాదని మరో వ్యక్తితో అక్రమ సంభంధం పెట్టుకొని తన భర్తపై ప్రియుడు, మరికొంత మందితో కలిసి దాడి చేశారు. దీనితో తండ్రి మృతి చెందగా, నిందితురాలైన తల్లి కటకటాల పాలు కానున్నది. దీనితో అమాయకులైన ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు.

**పోలీసుల వివరణ :** ఈ విషయంపై పాల్వంచ గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ. సురేష్ వివరణ కోరగా మృతిడి సోదరుడు గండికోట అయిలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ చేశామని చెప్పారు.

# కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** మొక్కజొన్న కోతలు పూర్తయ్యినా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు అరకొర ధరలకు పంటను విక్రయించాల్సి వస్తోందని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు వజ్జా రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కారేపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ 2400 ఉండగా, ప్రైవేట్ వ్యాపారులు కేవలం రూ 1600కే మొక్కజొన్న కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దీంతో రైతులకు పెట్టుబడే తిరిగి రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. యాసంగి వరి పంట కోతకు వచ్చిన నేపథ్యంలో మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అలాగే రైతు భరోసా పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసి వెంటనే నిధులు విడుదల చేయాలని, రూ 2లక్షల రుణమాఫీ కూడా తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు ముండ్ల ఏకాంబరం, నాయకులు పండగ కొండయ్య, కరపటి సీతారాములు, పాసిన్ని నాగేశ్వరరావు, వల్లభినేని మురళి, షేక్ సైదులు, బోజెడ్ల గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు గ్రామ సభలు

**ప్రజాపక్షం/పాల్వంచ:** ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలలో గ్రామ సభలను నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి జి. శ్రీనివాస్, ఎంపిడిఓ బొగ్గా నారాయణలు అన్నారు. స్థానిక ఎంపిడిఓ సమావేశ మందిరంలో గ్రామ పంచాయితీ కార్యదర్శులుతో బుధవారం గ్రామసభల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ నేడు నిర్వహించే గ్రామ సభలలో ప్రజా పాలనలో ప్రజలను భాగస్వాములను చేయటం కోసం, ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించటం, అభివృద్ధి పనులను గుర్తించటం, ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకతను పెంచడం కోసం గ్రామ సభలను నిర్వహిస్తున్నమని చెప్పారు. గ్రామ సభలకు గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, వివిధ శాఖల గ్రామ స్థాయి అధికారులు, ప్రజలు,మహిళలు, రైతులు, యువకులు, స్వయం సహాయక సభ్యులు, ప్రభుత్వ పథకాల లబ్దిదారులు హాజరు కావటానికి ముందస్తుగా వారికి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ చెన్నకేశవులు, ఏపిఓ పోరండ్ల రంగా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రం ఆకస్మికంగా తనిఖీ

**గర్భిణీలు, చిన్నారుకు నాణ్యమైన భోజనం అందించాలి**



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పంజాబ్‌గడ్డ 18వ డివిజన్‌లో కార్పొరేటర్ హిమశ్రీ అంగన్వాడీ 7వ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గర్భిణీలకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారంలో భాగంగా గుడ్లు, పిల్లలకు బాలామృతం పంపిణీ చేశారు. ఈ పోషకారంహా ఆరోగ్యానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అనంతరం కేంద్రంలో చిన్నారులకు వండుతున్న అన్నం, సాంబారును తనికీ చేశారు. ఆహార నాణ్యతపై సిబ్బందికి పలు సూచనలు చేసిన ఆమె నాణ్యతో కూడిన రుచికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కంచర్ల జమలయ్య, వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మధ్య దళారులు లేకుండా గిరిజన ఉత్పత్తులు నేరుగా విక్రయాలు

**- ఇది గిరిజన మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి ఎంతో మేలు**
**- ఐటిడిఏ పిఓ రాహుల్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** మధ్య దళారులు లేకుండానే గిరిజన ఉత్పత్తులు భద్రగిరి మార్ట్ ద్వారా నేరుగా విక్రయాలు సాగించనున్నామని, ఇది గిరిజన మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ తెలిపారు. బుధవారం పిఓ రాహుల్ తో కలిసి మార్ట్‌ను సందర్శించిన సెర్ఫ్ సీనియర్ మేనేజర్ భవాని శంకర్ ఉత్పత్తులను పరిశీలించారు. వాటి తయారీ విధానాన్ని తెలుసుకున్నారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఉత్పత్తులకు విస్తృతంగా ప్రాచుర్యం కల్పించేందుకు తమ సంస్థ నుండి సహకారం అందిస్తామన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల వస్తువులు అందుబాటులో ఉండేలా ర్యాకులను ఎప్పటికప్పుడు నింపాలని, కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు బిల్లులు తప్పని సరిగా ఇవ్వాలని ఆయన సిబ్బందికి సూచించారు.

# పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి

**మెరుగైన విద్యా బోధన అందించాలి**



**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రభుత్వ నిభంధనల మేరకు మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి నాగలక్ష్మి అన్నారు. పట్టణ పరిధి వికాలంగుల కాలనీలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను గురు వారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా మధ్యాహ్న భోజనాన్ని, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తున్న తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల అభివృద్ధి అంశాలపై ఉపాధ్యాయులతో కలిసి చర్చించారు. పాఠశాలకు కావలసిన మౌళిక సదుపాయాలు, ఇతర సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఉత్తమమైన విద్య అందించటానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం. రామక్రిష్ణ, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తోటి మిత్రునికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/కరకగూడెం:** అయ్యప్ప సేవ చిన్ముద్ర సేవా సంస్థ ద్వారా కరకగూడెం వారి ఆధ్వర్యంలో అయ్యప్ప మాల ధరించే కొమరం సుధాకర్ అకాల మృతి చెందడంతొ అతని కుటుంబానికి బుధవారం కరకగూడెం అయ్యప్ప చిన్ముద్ర సేవ సంస్థ ద్వారా 5000 రూపాయలు ఆర్థిక సాయం చేయడం జరిగింది.సహాయ సహకారాలు అందించిన కరకగూడెం అయ్యప్ప కుటుంబ సభ్యులు చందా మధు స్వామి, సోయం శ్రీను స్వామి, గుమ్మడవెల్లి శ్రీను స్వామి, గుమ్మడవెల్లి కృష్ణ స్వామి, ఎల్లు సోమిరెడ్డి స్వామి, రావుల కనకయ్య స్వామి, వైద బిక్షపతి స్వామి, ఆకుల నాగరాజ్ స్వామి, శిరిశెట్టి కమలాకర్ స్వామి, యాగ్గడి శ్రీను స్వామి, చిట్టి శ్రీను స్వామి, బైర్శెట్టి హేమంత్ స్వామి, భైరశెట్టి ధనుంజయ స్వామి, సిరి శెట్టి ప్రణయ్ స్వామి, తిప్పని సాయి స్వామి, చిట్టి శ్రీకాంత్ స్వామి, బుడగం పవన్ స్వామి, ప్రణయ్ అయ్యాగారు స్వామి, సాయి కిషోర్ స్వామి, ఎర్ర రాకేశ్ స్వామి, ముట్టని శివ స్వామి, మన అయ్యప్ప స్వామి గ్రూపులో ఉన్న స్వాములు తదితరులు పాల్గొన్నారు.

# యాదవుల ప్రజాప్రతి నిధుల సన్మానికి ఏర్పాట్లు

**ప్రజాపక్షం/కారేపల్లి:** ఈనెల 5వ తేదీన ఖమ్మం బైపాస్ రోడ్డులోని కృష్ణ ఫంక్షన్ హాల్‌లో యాదవుల ప్రజాప్రతి నిధుల సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఎంఎల్‌ఏ నవీన్ యాదవ్ హాజరవుతారని పేర్కొన్నారు. అలాగే పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖ నాయకులు పాల్గొననున్నారు. ఈ సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కారేపల్లి గ్రామంలో యాదవ ప్రముఖులతో అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షులు మల్లిబాబు యాదవ్ చర్చలు నిర్వహించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఇమ్మడి తిరుపతిరావు యాదవ్, అడ్డగోడ ఐలయ్య యాదవ్, గడ్డం వెంకటేశ్వర్లు, బోళ్ళ రమేష్ యాదవ్, దేగల ఉపేందర్ యాదవ్, మేకల కుమారస్వామి, గ్రామ పెద్దలు, మండల పెద్దలు పాల్గొన్నారు.